

నిత్యాన్నదానానికి విరాళాలు


అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అన్నదానానికి కర్రి సాయిలీల (రావులపాలెం) తొలి జీతం రూ.27,350, కర్రి నందన విశ్వనాథ్ (అమెరికా) రూ.20,232 చొప్పున విరాళాలు సమర్పించారు.



రూ.లక్ష విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి కోకా విజయలక్ష్మీ శేషకుమారి (కాకినాడ) ఆదివారం దేవస్థానం ఛైర్మన్ రోహిత్, ఈఓ రామచంద్ర మోహన్‌కు రూ.లక్ష విరాళం అందజేశారు.

డెల్టాలకు 7 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: డెల్టా కాలువలకు ఆదివారం 7 వేల క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1,600, మధ్య డెల్టాకు 1,400, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

నేడు యథావిధిగా స్పందన

అమలాపురం రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'స్పందన' (జగనన్నకు చెబుదాం) కార్యక్రమాలు సోమవారం యథావిధిగా నిర్వహించనున్నట్టు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో జిల్లాస్థాయిలోను, ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ స్థాయిలో, తహసీల్దార్ల కార్యాలయాల్లో, గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని వివరించారు. అధికారులు అందరూ సోమవారం ఉదయం 10 గంటల నుంచే ఫిర్యాదులను స్వీకరిస్తారని, గ్రామ వార్డు సచివాలయాల్లో మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల మధ్య విజ్ఞాపనలు స్వీకరిస్తారని కలెక్టర్ తెలిపారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేడు డయల్ యువర్ కోనసీమ ఆర్ఎం



ఆర్ఎం నాగేశ్వరరావు

అమలాపురం రూరల్: ఆర్టీసీ డిపోల పరిధిలో ప్రయాణికులకు అందిస్తున్న సేవలపై 20వ తేదీ సోమవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ రీజినల్ మేనేజర్ నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఆర్‌వీఎస్ నాగేశ్వరరావు తెలిపారు. అమలాపురం, రాజోలు, రావులపాలెం, రామచంద్రపురం డిపోల పరిధిలోని ప్రయాణికులు తమ సలహాలు, సూచనలు, సమస్యలను సెల్ నెంబర్ 99592 25576 ఫోన్ చేసి తెలియజేయవచ్చునని ఆయన తెలిపారు. అమలాపురం, రాజోలు, రావులపాలెం, రామచంద్రపురం డిపోల పరిధిలోని ప్రయాణికులు ఈ సదవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఎం కోరారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెరగాలి

ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రసాద్



సభలో మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రసాద్

అమలాపురం టౌన్: పుస్తక పఠనంపై నేటి విద్యార్థులకు మరింత ఆసక్తి పెరగాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వీఎల్ఎన్ఎస్‌వీ ప్రసాద్ అన్నారు. అందుకు విద్యార్థులు గ్రంథాలయాలను విధిగా వినియోగించుకోవాలని సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రథమ శ్రేణీ శాఖా గ్రంథాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు నాలుగు గోడల తరగతి గదుల్లో కూర్చుని సముపార్జించే విజ్ఞానానికి సార్థకత రావాలంటే పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. కాలం ఎంతటి ఆధునికత వైపు వెళ్తున్నా గ్రంథాలయాల విలువ శాశ్వతమైనదని అన్నారు. గ్రంథాలయాధికారి పోలిశెట్టి సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సభలో స్థానిక సాయి సంజీవిని మహిళా వాకర్స్ యోగా ఆరోగ్య సంస్థ అధ్యక్షురాలు జల్లి సుజాత, శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, సామాజిక కార్యకర్త మొహబూబ్ షకీలా తదితరులు ప్రసంగించారు.

సమసమాజ స్థాపకుడు ఆవంత్స

పిఠాపురం: సమసమాజ స్థాపనకు 82 ఏళ్ల పాటు తన రచనల ద్వారా పాటుపడిన మహోన్నతుడు ఆవంత్స సోమసుందర్ అని అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. ఆవంత్స సోమసుందర్ లిటరసీ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం పిఠాపురం సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో ఆవంత్స శత జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ నిబద్ధత గలిగిన రచయితగా సామాజికి మార్పు కోసం ఆవంత్స రచనలు చేసారన్నారు. మరో ముఖ్య అతిథి అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివ ప్రసాద్ మాట్లాడుతూ మనిషిని నడిపించేది ఒకటి సైన్సు అయితే రెండోది సాహిత్యం అన్నారు. సాహిత్యం ద్వారా సామాజిక చైతన్యం తీసుకురావడంలో సోమసుందర్ ఎంతో కృషి చేశారన్నారు. సాహిత్యానికి, కళలకు నేటి యువత దూరమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి యువతరం సోమసుందర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చెలికాని స్టాలిన్ పీఆర్ ప్రభుత్వ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ భరతలక్ష్మి, సహృదయ మిత్ర మండలి సభ్యులు పి.పావని, యువ రచయిత కిలారి గౌరీనాయుడు, రచయిత గౌరవ్, సోమసుందర్ లిటరసీ ట్రస్టు సభ్యులు డాక్టర్ గజరాజు సీతారామస్వామి, మేకా మన్మధరావు, ఆవంత్స విజయ శేషేంద్ర, శాతకర్ణి, గట్టి శ్రీకృష్ణ దేవరాయలు, మధునాపంతుల సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత ఆనందం

- ధాన్యం విక్రయించిన రోజే సొమ్ము చెల్లింపు
- రైస్ మిల్లర్ల దందా, దళారీ వ్యవస్థకు చెక్
- నాలుగేళ్లలో మద్దతు ధర రూ.433 పెంపు
- రెట్టించిన ఉత్సాహంతో రబీకి సన్నద్ధం



సంధిపూడిలో రైస్ మిల్లులకు తరలించేందుకు ధాన్యాన్ని బస్తాల్లో నింపుతున్న కూలీలు



పినపళ్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఆవశ్యకతను వివరిస్తున్న ఆర్డీఓ ముక్కంటి తదితరులు

ఆలమూరు: విత్తన దశ నుంచి పంట దిగుబడి చేతికి వచ్చే వరకూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసా కేంద్రాలు రైతులకు విస్తృత సేవలు అందిస్తున్నాయి. ఈ ఏడాది ప్రకృతి కరుణించడంతో పాటు వ్యవసాయ శాఖ తీసుకున్న ముందస్తు జాగ్రత్తలు, సకాలంలో ఎరువుల సరఫరా, సస్యరక్షణ చర్యల ద్వారా పంటకు సంభవించే తెగుళ్లను సత్వరం నివారించడంతో పంట దిగుబడి ఆశాజనకంగా ఉంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నాలుగేళ్ల కాలంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్వింటాల్‌కు మద్దతు ధర రూ.433 పెంచారు. 2019లో క్వింటాల్ ధర రూ.1770 ఉంటే 2023లో రూ.2203 చేరింది.

వరి రైతుకు సరైన గిట్టుబాటు ధర కల్పించాలన్న ఉద్దేశంతో గత సీజన్లలో సంభవించిన తప్పిదాలు పునరావృతం కాకుండా ఈ ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం పకడ్బందీగా ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసింది. రైతులకు సరియైన గిట్టుబాటు ధర దక్కడానికి ప్రత్యేక మార్గదర్శకాలను రూపొందించి సత్వరమే ఆచరణలో పెట్టింది. దీనివల్ల ధాన్యం అమ్మిన రోజే గంటల వ్యవధిలో సంబంధిత రైతు బ్యాంకు ఖాతాలో పంట సొమ్ము జమ అవుతోంది. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా ప్రభుత్వం ధాన్యం విక్రయాలను సులభతరం చేసి సరైన గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు హమాలీ, రవాణా చార్జీలు చెల్లించడం, తేమ శాతాన్ని సరళీకృతం చేయడం వంటి చర్యల వల్ల రైతుల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి.

విక్రయ కేంద్రాలపై ప్రత్యేక పర్యవేక్షణ

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఖరీఫ్ పంట పక్వానికి వచ్చిన దగ్గర నుంచి రైతులు తమ ఉత్పత్తులను విక్రయించుకుని సొమ్ము చెల్లింపులయ్యే వరకూ పౌరసరఫరాల, వ్యవసాయ, రెవెన్యూ, మార్కెటింగ్ శాఖాధికారులు అనునిత్యం పర్యవేక్షిస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1,58,281 ఎకరాల్లో 96,572 మంది రైతులు వరి సాగు చేపట్టారు. అందులో అధిక భాగం స్వర్ణ (ఎంటీయూ 7029) రకం కాగా కొన్ని ప్రాంతాల్లో రైతులు ఎంటీయూ 1318 రకాన్ని సాగు చేశారు. ఈ ఏడాది ఖరీఫ్ పంటలో ధాన్యం ఎకరానికి 32 నుంచి 38 బస్తాల వరకూ దిగుబడి వస్తుంది. అలాగే తేమ శాతానికి ప్రభుత్వం సడలింపులు ఇవ్వడంతో రైతుకు పూర్తి స్థాయి ధర క్వింటాల్‌కు రూ.2203 వరకూ దక్కుతుంది. జిల్లా వ్యాప్తంగా రైతుల సౌకర్యార్థం 5.09 లక్షల గోనె సంచులను అధికారులు అందుబాటులో ఉంచారు. ధాన్యాన్ని తరలించేందుకు వీలుగా ప్రభుత్వం 1051 జీపీఎస్ కలిగిన వాహనాలను సిద్ధం చేసింది. ఎకరాకు రూ.28 వేల వరకూ పెట్టుబడి అవుతుండగా ప్రభుత్వం తీసుకున్న చొరవ వల్ల ఎకరాకు రూ 53 వేల వరకూ ఆదాయం లభిస్తోంది. రైతు పంట కోసి మాసూళ్లు చేసిన వ్యవసాయ క్షేత్ర సహాయకులు వెళ్లి, రెవెన్యూ శాఖ సహకారంతో ధాన్యాన్ని కొనుగోలు చేసి, వాహనాన్ని కూడా వారే సమకూర్చి సమీపంలోని మిల్లులకు సరఫరా చేస్తున్నారు. రైతుకు సమస్య ఏదైనా ఉత్పన్నమైతే సత్వరమే అధికారులు అక్కడికి చేరుకుని పరిష్కరిస్తున్నారు.

రైతుకు వెన్నుదన్నుగా ఆర్బీకేలు

వరి పంటకు రికార్డు స్థాయిలో ప్రభుత్వం సరైన గిట్టుబాటు ధర కల్పిస్తున్న రైతు భరోసా కేంద్రాలు రైసు మిల్లర్లు, దళారుల చేతిలో చిక్కుకోకుండా రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో దళారులు చెప్పిన ధరకే అమ్ముకుని తీవ్రంగా నష్టపోయిన రైతాంగానికి ప్రస్తుత ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు చక్కని ఊరటనిస్తున్నాయి. వ్యవసాయం మీద మమకారాన్ని, ప్రభుత్వం మీద నమ్మకాన్ని పెంచుతున్నాయి. జిల్లాలోని ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం కల్పిస్తున్న ధరకు ఇంచుమించుగా కొనుగోలు చేసేందుకు ప్రైవేటు వ్యాపారులు ముందుకు వస్తున్నారు. తమకు ధాన్యం అమ్మితే చాలు ఎలాంటి కొర్రీలు వేయబోమని, ధరల్లో కోత విధించబోమని రైతులను వేడుకుంటున్న పరిస్థితి ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా నెలకొంది. రవాణాలో అప్పుడప్పుడు సంభవిస్తున్న సాంకేతిక సమస్యలను త్వరలోనే అధిగమిస్తామని జాయింట్ కలెక్టర్ నూపుర్ అజయ్ చెబుతున్నారు. జిల్లాలో ఈ సీజన్‌లో 4.8 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా కాగా బహిరంగ మార్కెట్‌లో 3.88 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అమ్మకానికి వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. ఖరీఫ్ సీజన్ ఆశాజనకంగా ఉండటంతో పాటు సమయానికి పంట సొమ్ము చేతికి అందడంతో రెట్టించిన ఉత్సాహంతో రైతులు రబీ సాగుకు సన్నద్ధమవుతున్నారు.



ఆలమూరులో జీపీఎస్ ట్రాకింగ్ కలిగిన ట్రాక్టర్‌పై తరలిస్తున్న ధాన్యం



సకాలంలో గిట్టుబాటు

రైతు పేరు: బొబ్బా వెంకన్న గ్రామం: పెదపళ్ల

సాగు చేసిన భూమి	38.3 ఎకరాలు
ధాన్యం రకం	ఎంటీయూ 7029 (స్వర్ణ)
దిగుబడి	1557 బస్తాలు
చెల్లించాల్సిన సొమ్ము	16.37 లక్షలు
బ్యాంకు ఖాతాలో జమ	11.98 లక్షలు
రావాల్సిన సొమ్ము	4.39 లక్షలు

రైతులకు మేలు కల్పించడమే లక్ష్యం



రైతులు ఆరుగాలం పడించిన పంటకు సరైన గిట్టుబాటు ధర కల్పించి వారి జీవన ప్రమాణాలను పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోంది. ఆర్బీకె ద్వారా అనేక సేవలను రైతులకు అందిస్తోంది. రెట్టించిన ఉత్సాహంతో రబీ సాగుకు రైతులను సన్నద్ధం చేసే దిశగా ఇప్పటి నుంచే చర్యలు చేపడుతున్నాం. ధాన్యం సరఫరాలో తలెత్తుతున్న చిన్న చిన్న సమస్యలను త్వరలోనే అధిగమిస్తాం.

– ఓలేటి బోసుబాబు, జిల్లా వ్యవసాయాధికారి, అమలాపురం

అంతర్జాతీయ ఫొటోగ్రఫీలో రవికాంత్ ప్రతిభ



అవార్డు అందుకుంటున్న రవికాంత్

మామిడికుదురు: దుబాయ్ ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన అంతర్జాతీయ ఫొటోగ్రఫీ పోటీల్లో మామిడికుదురు మండలం మొగలికుదురు వాసి కూర్మా రవికాంత్ బ్లాక్ అండ్ వైట్ కేటగిరీలో మొదటి బహుమతి సాధించాడు. ఈ నెల 16వ తేదీన దుబాయ్‌లో జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో రవికాంత్‌కు అక్కడి ప్రభుత్వ ప్రతినిధి ప్రశంసాపత్రంతో పాటు 15 వేల యూఎస్ డాలర్లు (రూ.12.50 లక్షలు) నగదు బహుమతి అందించారు. 'ఏ డ్యాన్స్ ఆఫ్ సీగల్స్' పేరిట ఈ పోటీ నిర్వహించారు. ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఈ అవార్డు అందుకోవడం చాలా ఆనందంగా ఉందని రవికాంత్ ఈ సందర్భంగా అన్నారు. ఈ పోటీల్లో మన దేశం నుంచి తానొక్కడినే పాల్గొన్నానని చెప్పారు. బీటెక్ పూర్తి చేసిన రవికాంత్ ఫ్రీలాన్స్ ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తున్నారు. అంతర్జాతీయ ఫొటోగ్రఫీ పోటీల్లో మొదటి బహుమతి గెలుపొందిన రవికాంత్‌ను పలువురు అభినందించారు.



బహుమతి పొందిన రవికాంత్ చిత్రం

శ్రీపీఠం.. భక్తజనసంద్రం



లలితా కుంకుమార్చనల్లో వేలాదిగా పాల్గొన్న భక్తులు



శ్రీపీఠంలో దీపోత్సవ కాంతులు

కాకినాడ రూరల్: మహాశక్తియాగం జరుగుతున్న కాకినాడ రమణయ్యపేటలోని శ్రీపీఠం భక్తజనసంద్రంగా మారుతోంది. ఈ మహాయాగానికి వస్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామీజీ పర్యవేక్షణలో ఈ యాగం ఈ నెల 14న ప్రారంభమైన విషయం తెలిసిందే. యాగంలో భాగంగా అష్టాదశ శక్తి పీఠాల్లో కొలువై ఉన్న ఆదిపరాశక్తిని ఒకేచోట మహాశక్తిగా ఆవిష్కరించే అద్భుత ఘట్టంగా శతకోటి లలితా కుంకుమార్చనలు నిర్వహిస్తున్నారు. రోజూ 10 వేల నుంచి 12 వేల మందితో నెల రోజుల పాటు కుంకుమార్చనలు నిర్వహించాలని తలపెట్టారు. అయితే 15 వేలకు మందికి పైగా మహిళలు వివిధ ప్రాంతాల



భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తున్న పరిపూర్ణానంద స్వామి

నుంచి తరలివస్తున్నారు. యాగం ఆరో రోజైన ఆదివారం యాగశాలలో ఉదయం నక్షత్ర పూజ, తిథి దేవత పూజ నిర్వహించారు. అనంతరం జరిగిన లలితా కుంకుమార్చనలకు పెద్ద సంఖ్యలో మహిళలతో పాటు పురుషులు కూడా హాజరయ్యారు. మూడుసార్లు లలితా నామార్చనలతో కుంకుమార్చనలు చేశారు. వచ్చిన భక్తులందరికీ అన్నదానం చేశారు. దీనికోసం వలంటీర్లు శ్రమిస్తున్నారు. దీపోత్సవ వేదికపై సాయంత్రం శోభారాజ్ బృందం ఆలపించిన కర్నాటక సంగీతం శ్రోతలను అలరించింది. పార్వతీ పరమేశ్వరులను పల్లకీ సేవతో ఊరేగింపుగా దీపోత్సవ వేదిక వద్దకు తీసుకువచ్చిన అనంతరం పరిపూర్ణానంద స్వామి అనుగ్రహ భాషణం చేశారు. అనంతరం భక్తుల చేతులు మీదుగా దీపోత్సవం చేశారు. దీపకాంతులతో శ్రీపీఠం వెనుక ఉన్న గోశాల ప్రాంగణం వెలుగులతో నిండిపోయింది.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు



అంతర్వేది ఆలయంలో స్వామి దర్శనానికి వేచిఉన్న భక్తులు



అయినవిల్లిలో ప్రత్యేక అభిషేకాల్లో పాల్గొన్న భక్తులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని సన్నిధికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్తిక మాసంలో ఆదివారం సెలవు కావడంతో స్వామి దర్శనానికి పలువురు పిల్లాపాపలతో వచ్చారు. ఆలయంలో నిర్వహించే సుదర్శన హోమంలోనూ అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నిత్యాన్నదాన పథకంలో సుమారు 7 వేల మంది స్వామివారి ప్రసాదం స్వీకరించినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. క్యూ లైన్లలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఉండేందుకు ఆయన తగిన చర్యలు చేపట్టారు. అలాగే, భక్తుల తాగునీటి వసతికి కూడా దేవస్థానం ఏర్పాట్లు చేసింది.

అయినవిల్లి గణపతి దర్శనానికి భక్తుల బారులు

అయినవిల్లి: విఘ్నేశ్వరుని ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి మేలుకొలుపు సేవ నిర్వహించారు. అనంతరం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారి లఘున్యాస అభిషేకాలు, లక్ష్మీ గణపతి హోమంలో అధిక సంఖ్యలో భక్త దంపతులు పాల్గొన్నారు. స్వామివారికి గరిక పూజ నిర్వహించారు. పంచామృత, ప్రత్యేక అభిషేకాల్లో 146 మంది భక్త దంపతులు, స్వామి వారి ప్రత్యేక దర్శనంలో 1,010 మంది భక్తులు, శ్రీ లక్ష్మీ గణపతి హోమంలో 38 మంది పాల్గొన్నారు. నూతన వాహనాలకు 29 మంది పూజలు చేయించుకున్నారు. చిన్నారులకు నామకరణాలు, అక్షరాభ్యాలు, తులాభారం వంటి ప్రత్యేక కార్యక్రమాలను 30 మంది నిర్వహించారు. స్వామివారికి వివిధ పూజలు, అన్నదాన విరాళాల ద్వారా రూ.3,56,591 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

కాకినాడలోనే.. కలర్‌ఫుల్ ప్రింటింగ్

- చేరువలోనే ప్రింటింగ్ క్లస్టర్
- టైర్–2 సిటీల్లో ఇక్కడే తొలిసారి
- జపాన్ టెక్నాలజీ, అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు
- రూ.15 కోట్ల పెట్టుబడి
- ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం



దబుల్ దమ్మీ కొమోరి మల్టీకలర్ జపాన్ తయారీ ప్రింటింగ్ మెషీన్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: అంతర్జాతీయ ప్రమాణాలతో.. కళ్లు మిరుమిట్లు గొలిపే మల్టీకలర్ ప్రింటింగ్ మనకూ అందుబాటులోకి వచ్చేస్తోంది. ఎక్కడో దూరంగా ఉన్న విజయవాడలో కానీ అందుబాటులో లేని అత్యంత ఆధునిక టెక్నాలజీ ఇకపై మన దరి చేరబోతోంది. రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటు, చొరవతో కాకినాడలోనే ప్రింటింగ్ క్లస్టర్ అందుబాటులోకి రానుంది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు చేయూతనిచ్చేలా ఈ క్లస్టర్ సిద్ధమవుతోంది. టైర్–2 (రెండో శ్రేణి) నగరాల్లో రాష్ట్ర ప్రభుత్వం చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహిస్తోంది. వీటి ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలనే సంకల్పంతో పారిశ్రామిక క్లస్టర్లు తీసుకు వస్తోంది. దీనిలో భాగంగా కాకినాడలో ఇప్పటికే ప్రింటింగ్ క్లస్టర్ పనులు చివరి దశకు చేరుకుని ప్రస్తుతం ట్రయల్ రన్ జరుగుతోంది.

క్లస్టర్లతో ఉపాధికి ఊతం

క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఉమ్మడి సదుపాయాల కేంద్రాలను (కామన్ ఫెసిలిటీ సెంటర్లు) ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తోంది. ఒకేచోట అన్ని రకాల సేవలూ అందుబాటులో ఉంచాలన్నది ప్రభుత్వ సంకల్పం. ఇందుకు అనుగుణంగా క్లస్టర్ల ఏర్పాటుకు రెండు రకాల రాయితీలు అందిస్తోంది. మొదటి కేటగిరీలో 10 సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, రెండో కేటగిరీలో 20 సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. మొదటి కేటగిరీ రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లు, రెండో కేటగిరీ క్లస్టర్‌ను రూ.10 కోట్ల నుంచి రూ.30 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తారు. దాదాపు నిర్మాణం పూర్తయిన కాకినాడ ప్రింటింగ్ క్లస్టర్ రెండో కేటగిరీలో సుమారు రూ.15 కోట్లతో ఏర్పాటైంది. దీనిలో కేంద్రం 70 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 15 శాతం చొప్పున రాయితీ సమకూరుస్తున్నాయి. ఈ క్లస్టర్‌లో ఒకేసారి 200 మంది ప్రింటర్లకు సరిపడా సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. ఇంతటి భారీ స్థాయిలో ప్రింటింగ్ క్లస్టర్ రావడం జిల్లా పారిశ్రామిక మైలురాయిగా నిలిచిపోతుందని పలువురు అంటున్నారు.

తప్పనున్న దూరాభారం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురంతో పాటు మండపేట, రామచంద్రపురం తదితర పట్టణాల్లో సుమారు 500 ప్రింటింగ్ యూనిట్లు ఉన్నాయి. అయినప్పటికీ వేల సంఖ్యలో మల్టీకలర్ డిజైనింగ్, ప్రింటింగ్, బైండింగ్, కటింగ్ వంటి భారీ ఆర్డర్లు ఉంటే వ్యయప్రయాసలకు ఓర్చి విజయవాడ వెళ్లాల్సి వచ్చేది. కాకినాడలో ప్రింటింగ్ క్లస్టర్ అందుబాటులోకి రావడంతో ఆ బాధ తప్పుతుంది.

అందుబాటులో అత్యాధునిక మెషీన్లు

- మల్టీకలర్ ప్రింటింగ్ ఈ క్లస్టర్ ప్రత్యేకత. జపాన్‌లో తయారైన ప్రింటింగ్, ఫోల్డింగ్, స్టేషనరీ, బైండింగ్, గమ్మింగ్, సీటీపీ, కటింగ్ తదితర 12 రకాల భారీ మెషీన్లు ఈ క్లస్టర్‌కు వచ్చేశాయి.
- జపాన్‌లో అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన జీఎల్–37 అనే మెషీన్ కూడా ఈ క్లస్టర్‌కు చేరుకుంది. ఈ మెషీన్‌తో ఏకకాలంలో డబుల్ డమ్మీలు రూపొందించవచ్చు. కాకినాడ క్లస్టర్‌లో తప్ప రాష్ట్రంలో మరెక్కడా ప్రస్తుతం ఈ మెషీన్ అందుబాటులో లేకపోవడం విశేషం.
- వెబ్ మెషీన్లు కూడా ఈ క్లస్టర్‌లో అందుబాటులోకి వచ్చాయి. ఒకేసారి లక్ష ఏ4 బ్లాక్ అండ్ వైట్ కాపీలు తీయడం ఈ వెబ్ మెషీన్ ప్రత్యేకత. 4 వేల ఏ4 షీట్లతో ప్లేట్ ప్రింటింగ్‌కు విజయవాడలో రూ.2 వేల నుంచి రూ.2,500 వరకూ వ్యయం అవుతూంటే అదే కాకినాడ క్లస్టర్‌లో రూ.1600 మాత్రమే అవుతుంది.

వ్యయప్రయాసలు తప్పుతాయి



రాష్ట్రంలో మరెక్కడా లేని సాంకేతిక పరిజ్ఞానంతో మల్టీకలర్ ప్రింటింగ్ ఇక్కడ అందుబాటులోకి రావడం చాలా గొప్ప విషయం. ఎన్నో వ్యయప్రయాసలు ఎదుర్కొని విజయవాడ వెళ్లాల్సిన అవసరం కాకినాడ ప్రింటింగ్ క్లస్టర్ ఏర్పాటుతో తప్పుతుంది. విజయవాడ వెళ్తే ఒక రోజు వృథాగా పోయేది. దాదాపు అన్ని మెషీన్లూ వచ్చేశాయి. ఒకే ఒక్క మెషీన్ జపాన్ నుంచి రావాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం రెండో విడత నిధులు విడుదల చేస్తుందని ఎదురు చూస్తున్నాం. ఈ క్లస్టర్‌లో కామన్ ఫెసిలిటీ సెంటర్‌తో ఉత్తమమైన సేవలు అందుబాటులోకి వస్తాయి. ఈ క్లస్టర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తొలి నుంచీ ఎంతో ప్రోత్సహించి, రాయితీ కూడా మొదట్లోనే విడుదల చేసింది.

– బాలప్రసాద్, ఎండీ, సత్యదేవ ప్రింటింగ్ క్లస్టర్, కాకినాడ

భవిష్యత్ అంతా పారిశ్రామిక క్లస్టర్లదే..



భవిష్యత్ అంతా క్లస్టర్లదే. చిన్నచిన్న పారిశ్రామికవేత్తలు ఒకేచోట కామన్ ఫెసిలిటీ సెంటర్ల ద్వారా సేవలందుకోవచ్చు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని స్థాయిల్లోనూ తొలి నుంచీ ప్రోత్సాహాన్ని అందించడంతో ప్రింటింగ్ క్లస్టర్ దాదాపు సిద్ధమైంది.

– టి.మురళి, జనరల్ మేనేజర్, జిల్లా పరిశ్రమల కేంద్రం

రత్నగిరికి భక్తుల తాకిడి

- 60 వేల మందికి పైగా రాక
- 5,200 వ్రతాలు, రూ.60 లక్షల ఆదాయం

అన్నవరం: కార్తిక మాస తొలి ఆదివారం సందర్భంగా రత్నగిరి సత్యదేవుని సన్నిధికి వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. ఆదివారం సెలవుదినం కావడం, ఉదయం 7-30 గంటల నుంచి సప్తమి పర్వదినం రావడంతో ఈ రద్దీ ఏర్పడింది. సుమారు 60 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించారని అధికారులు అంచనా వేశారు. సత్యదేవుని వ్రతాలు సాయంత్రం ఐదు గంటల సమయానికి సుమారు 5,200 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.60 లక్షలు ఆదాయం వచ్చినట్లు అధికార్లు తెలిపారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ రామచంద్రమోహన్ దేవస్థానంలో పలు విభాగాలు సందర్శించి ఏర్పాట్లు పర్యవేక్షించారు. శనివారం రాత్రికే సుమారు పది వేల మంది భక్తులు రత్నగిరికి చేరుకోవడంతో ఆలయాన్ని ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటలకు తెరిచి వ్రతాలు ప్రారంభించారు. సుమారు పది వేల మందికి పులిహోర, దధ్యోజనం పంపిణీ చేశారు. సుమారు 60 వేల ప్రసాదం ప్యాకెట్లు విక్రయించారు. వ్రతాల ద్వారా రూ.30 లక్షలు, ప్రసాదం విక్రయాల ద్వారా రూ.12 లక్షలు, మిగిలిన విభాగాల ద్వారా రూ.20 లక్షల ఆదాయం వచ్చిందని అంచనా వేశారు.



నిత్యకల్యాణ మండపంలో జరుగుతున్న వ్రతాలు

సొంత భవనంలోకి అకీరా ఆస్పత్రి

అమలాపురం టౌన్: గత 13 ఏళ్లగా అమలాపురం యునైటెడ్ నర్సింగ్ హోమ్ నుంచి వైద్య సేవలు అందిస్తున్న అకిరా కంటి ఆస్పత్రి సోమవారం సొంత భవనంలోకి మారనుంది. పట్టణ శివారు పేరూరులో 216 జాతీయ రహదారి చెంత నూతనంగా నిర్మించిన సొంత భవనంలోకి ఆస్పత్రిని తరలిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆధునాతన వైద్య సౌకర్యాలతో నిర్మించిన ఈ భవనంలో ఎప్పటిలాగే కంటి వైద్య సేవలు అందిస్తామని అకిరా కంటి ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ ఎస్.ప్రభాకరరావు, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ హరిప్రియ ఓ ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరం ఆర్యాపురంలో ప్రథమంగా ఆస్పత్రిని ఏర్పాటు చేస్తే తర్వాత విజయవాడలోని భారతీనగర్, జోర్నకల్ రోడ్‌లో రెండు ఆస్పత్రులు ఏర్పాటు చేసి ఇప్పుడు మూడో కేంద్రంగా అమలాపురంలో సొంత భవనం ద్వారా పూర్తి స్థాయి వైద్య సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు.